అయోమయంలో అన్నదాత

రుణమాఫీపై వీడని గందరగోళం
- హెల్ప్‌డెస్క్‌కు 4,650 ఫిర్యాదులు
- అత్యధికంగా నవాబుపేట మండలంలో..
- రోజుకు వందల్లో ఫోన్ కాల్స్
- మూడు దశల్లో రూ.865 కోట్లు మాఫీ
- లబ్ధి పొందిన రైతు కుటుంబాలు 91,956


రుణమాఫీ కాలేదని కలెక్టర్‌కు తమ గోడు వినిపిస్తున్న రైతులు

వికారాబాద్: రుణమాఫీ విషయంలో ఇంకా అయోమయం పరిస్థితి వీడటం లేదు. మూడు విడతల్లో ప్రక్రియ పూర్తయినా ఇంకా స్పష్టత రావడం లేదు. ప్రభుత్వ నిబంధనలు, బ్యాంకర్ల కొర్రీలు రైతుల పాలిటశాపంగా మారాయి. సగం మందికి మాత్రమే మాఫీ జరిగిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వికారాబాద్‌లోని కెనరా బ్యాంకు అధికారుల నిర్వాకంతో వేల మంది అన్నదాతలు వడ్డీ నష్టపోయారు. రుణం తీసుకున్న నాటి నుంచి వడ్డీతో కలిపి ప్రభుత్వం రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీ చేయగా ఈ బ్యాంకు అధికారులు వడ్డీ కలపకుండానే ప్రభుత్వానికి అప్పుల జాబితా పంపారు. దీంతో రుణం తీసుకున్న రైతులందరూ అప్పు పొందిన నాటి నుంచి వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి తలెత్తింది. రూ.2 లక్షల లోపు రుణాలు పొందిన రైతులు సైతం వడ్డీ చెల్లించాల్సి వస్తోంది.

వేల సంఖ్యలో ఫిర్యాదులు

మాఫీ కాని రైతుల కోసం కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. అన్నదాతల నుంచి కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 4,650 మంది రైతులు ఫిర్యాదులు సమర్పించారు. మరో వైపు అనుమానాలు నివృత్తి చేసుకునేందుకు రోజుకు 500 నుంచి 600 వరకు ఫోన్ కాల్స్ వస్తున్నాయి. జిల్లాలో అత్యధికంగా నవాబుపేట మండలంలోనే 1,071 మంది రైతులు ఫిర్యాదులు చేశారు. కొందరు కలెక్టర్ కార్యాలయంలో రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తున్నారు. చాలా మందికి రేషన్ కార్డులు లేకపోవడంతో మాఫీ వర్తించలేదు. ఆధార్ కార్డు మ్యాచ్ కాకపోవడం వల్ల కూడా మాఫీ కాలేదు. రూ.2 లక్షల పైన రుణాలున్న రైతులు ఆపై మొత్తాన్ని బ్యాంకులకు చెల్లిస్తే పథకం వర్తిస్తుందని ఎమ్మెల్యేలు చెబుతుండగా బ్యాంకర్లు మాత్రం క్లారిటీ ఇవ్వడంలేదు. వేల సంఖ్యలో అర్హులున్నా పథకం పొందలేకపోయారు.

మూడు దశల్లో..

మూడు విడతల్లో రూ. 865 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. అయితే సగం మంది రైతులే లబ్ధి పొందారు. జిల్లాలో 5.90లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా 2.50 లక్షల మంది రైతులు ఉన్నారు. గత ఏడాదిలో 1,78,522 మంది రైతులు వివిధ బ్యాంకుల్లో రూ.2582 కోట్ల పంట రుణాలు పొందారు. అయితే ప్రభుత్వం మాఫీ రైతులకు కాకుండా రైతు కుటుంబాలు అనే నిబంధన పెట్టడంతో చాలా మందికి లబ్ధి చేకూరలేదు.

మూడు విడతల్లో..

మొదటి విడతలో 46,633 మంది రైతులకు, రూ. 256.26 కోట్లు మాఫీ అయ్యింది. రెండో దశలో 26,438 మంది రైతులు, రూ. 262.64 కోట్లు, మూడో విడతలో 18,885 మంది రైతులకు రూ.247.71 కోట్ల రుణమాఫీ చేశారు.

విద్యార్థులకు అభ్యసన సామగ్రి పంపిణీ


పంపిణీ చేసిన బ్యాగులతో విద్యార్థులు

బొంరాస్‌పేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే నిరుపేద విద్యార్థులే రేపటి సమాజానికి నిదర్శనం కావాలని తెలంగాణ విద్యావంతుల వేదిక (టీవీవీ) రాష్ట్ర కార్యదర్శి కె. రవీందర్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని నాందార్‌పూర్ ప్రాథమికోన్నత పాఠశాల, దుద్యాల ఉన్నత పాఠశాలలో 150మంది విద్యార్థులకు యూత్ ఫర్ సేవా, స్టేట్ స్ట్రీట్ వారు ఉచితంగా బ్యాగులు, నోటు పుస్తకాలు, అభ్యసన సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. 13 ఏళ్లుగా యూత్ ఫర్ సేవా కొడంగల్ ప్రాంతానికి అందిస్తున్న సేవలను గుర్తు చేశారు. కరోనా కాలంలోనూ పల్స్ ఆక్సీమీటర్లు, ఆక్సిజన్ యంత్రాలు ఇచ్చారని కొనియాడారు. కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంట్రాములుగౌడ్, ఎంఈఓ రాంరెడ్డి ఉచితసేవను అభినందించారు. నాందార్‌పూర్ విద్యార్థులకు డిజిటల్ క్లాస్ బోర్డును త్వరలో ఉచితంగా అందిస్తామని సంస్థ ప్రతినిధులు హరీశ్, భరద్వాజ్ ప్రకటించారు. అలాగే, పాఠశాలల, ఉపాధ్యాయుల పనితీరుపై స్టేట్‌స్ట్రీట్ బృందం హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో టీవీవీ, టీజేఏసీ నాయకులు గోపాల్, చంద్రశేఖర్, అనిల్‌కుమార్, హెచ్‌ఎంలు రామయ్య, విజయరామారావు, వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు మల్లప్ప, సుధాకర్‌రావు, రాములు, సాలిబాయి, నవీన, రవికుమార్, జీవన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ ధర్మకర్త నర్సింలుకు నివాళి


నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు

కొడంగల్ : పట్టణంలోని శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాత, ఆలయ శాశ్వత ధర్మకర్త నందారం మిడిదొడ్డి నర్సింలు గుప్తా వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు శనివారం ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. శ్రీవారి భక్తుడైన నర్సింలు తన చివరి దశలో తిరుమలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆయన నిత్యం భగవంతుడిని స్మరించేవాడు. ఈ క్రమంలో శ్రీవారు ఆయనకు కలలో కనిపించి కొడంగల్‌లోనే ఆలయం నిర్మించి దర్శించుకోవాలని సూచించారు. దీంతో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన అర్చకులతో చర్చించి, శ్రీ వైఖానస ఆగమ శాస్త్రోకంగా ఆలయ నిర్మాణం చేపట్టారు. నాటి నుంచి వరకు పట్టణంలోని శ్రీవారి ఆలయంలో నిత్యపూజలు కైంకర్యాలు, బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు.

క్లుప్తంగా

జుంటుపల్లికి భక్తుల తాకిడి


స్వామివారిని దర్శించుకునేందుకు బారులుతీరిన భక్తులు

యాలాల: మండలంలోని జుంటుపల్లి సీతారామచంద్రస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. మూడవ శ్రావణ శనివారం కావడంతో భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలలో వంట, నైవేద్యాలు చేసి ఉపవాస దీక్షలు విరమించారు. తాండూరుకు చెందిన బిచ్చాల మల్లయ్య అన్నదానం నిర్వహించారు. ఆలయానికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ హన్మంత్‌రావు తెలిపారు.

నోట్ పుస్తకాల పంపిణీ


సామగ్రి పంపిణీ చేస్తున్న సభ్యులు

దౌల్తాబాద్: మండలంలోని దాసరిగూడెం, యాంకి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠ్య సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. నోట్ పుస్తకాలు, మ్యాట్లు, బ్యాగులు, చెప్పులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భీమప్ప, ఫౌండేషన్ సభ్యులు పులేందర్, వెంకటయ్య తదితరులున్నారు.

ధారూరు మార్కెట్‌కు భారీగా పెసలు


మార్కెట్లో జరుగుతున్న బీట్లు

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు శనివారం పెసలు(పెసర) పోటెత్తాయి. రైతులు 1,165 బస్తాల పెసలు తీసుకొచ్చారు. క్వింటాల్‌కు రూ. 5,650 నుంచి రూ.7,450 వరకు అమ్మకాలు జరిగాయి. అలాగే, 30 సంచుల పసుపు రాగా క్వింటాల్‌కు రూ. 8,880 నుంచి రూ.12 వేల వరకు కొనుగోలు చేశారని ఏఎంసీ కార్యదర్శి సిద్ధమ్మ తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత


పూజలు చేస్తున్న అరుణరాజప్ప, భక్తులు

కుల్కచర్ల: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతోందని మాజీ ఎంపీపీ అరుణరాజప్ప అన్నారు. శనివారం కుల్కచర్ల మండలం కుస్మసముద్రం గ్రామ పరిధిలోని విశ్వనాథ ఆలయం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ఆధ్యాత్మికతను పెంపొందించుకోవడం వల్ల ప్రతి ఒక్కరిలో మానసికంగా మార్పును పొందుతారని అన్నారు. ఆలోచన విధానంలో మార్పులు వస్తాయని తద్వారా ఉపయోగకరమైన ఫలితాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు లక్ష్యంతో చదవాలి

తహసీల్దార్ మునీరొద్దీన్


దుప్పట్లు అందజేస్తున్న తహసీల్దార్, ఎస్‌ఐ

మర్పల్లి: వసతి గృహంలో ఉంటు చదువుకుంటున్న బాలికలు లక్ష్యంతో చదవాలని మర్పల్లి తహసీల్దార్ మునీరొద్దీన్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో చదువుకుంటున్న బాలికలకు ఎస్‌ఐ సురేశ్, వార్డెన్ తుల్జారామ్‌గౌడ్‌తో కలిసి ప్రభుత్వం సరఫరా చేసిన దుప్పట్లు, కార్పెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. పేద విద్యార్థుల చదువుల కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం వసతి గృహంలోని మౌలిక సదుపాయాల గురించి విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సురేశ్, ఆర్‌ఐ మాధవరెడ్డి, వార్డెన్ తుల్జారామ్ వర్కర్లు, విద్యార్థినిలు ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ


వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ, అంగన్‌వాడీ టీచర్లు

పరిగి: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ అన్నారు. శనివారం పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీడీపీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చాలని పోరాటం చేస్తే, ప్రభుత్వం మినీ నుంచి మెయిన్‌గా మార్చినా ఇంకా రెండు నెలల వేతనాలు పెండింగ్‌లోనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు కొన్నిసార్లు పాత వేతనాలే ఇస్తున్నారని వాపోయారు. ఈ విషయంపై పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. కార్యక్రమంలో మంజుల, సరూప, దేవి, విజయ పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి బదిలీ సహజం



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

కుల్కచర్ల: ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పనిసరిని మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్ అన్నారు. శనివారం మండలంలోని బండవెల్కిచర్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన రాములు, శేఖర్, బస్వరాజు, వెంకటేశ్వరరావులను ఘనంగా సన్మానించారు. అలాగే, నూతనంగా పాఠశాలకు వచ్చిన ప్రధానోపాధ్యాయులు వీరేశం, రమేష్, సోమ్లా, సంతోషిలను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. ఉత్తమంగా పనిచేసే ఉపాధ్యాయులకు ఎక్కడకు వెళ్లిన గుర్తింపు, గౌరవం లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ కుల్కచర్ల మండల అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి బస్వరాజు, గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శరత్‌కృష్ణ పాల్గొన్నారు.

అకింతభావంతో గుర్తింపు

మర్పల్లి: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ తప్పనిసరి అని మర్పల్లి ఏఓ శ్రీకాంత్ అన్నారు. మర్పల్లి ఏఓగా పని చేసిన వసంత ఇటీవల రాజేందర్‌నగర్ రైతు శిక్షణ కేంద్రానికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం వ్యవసాయ కార్యాలయంలో వసంతకు ఏఈఓలు సన్మానం చేశారు. ఈ సందర్భంగా నూతన ఏఓ శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తే ప్రజల నుంచి మంచి గుర్తింపు లభిస్తోందన్నారు. ఏఓ వసంత మాట్లాడుతూ.. 11 సంవత్సరాలు నుంచి ఏఓగా విధులు నిర్వర్తించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఏఓగా సుదీర్ఘకాలం పనిచేసి వెళ్లడం తమకు బాధ కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు ఉన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ధారూరు: మండల కేంద్రానికి మంజూరైన రూ. 13.20 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో శనివారం అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ధారూరులోని బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో నిర్మించిన ఓవర్‌హెడ్‌ట్యాంకు పక్కనే బోరు వేయించారు. మిషన్‌భగీరథ తాగునీటి సరఫరా లేనప్పుడు ఈ బోరు నుంచి నేరుగా ట్యాంకులోకి నీటిని నింపి కాలనీవాసులకు పంపింగ్ చేయనున్నారు. కాంగ్రెస్ నాయకులు పూజ చేసి డ్రిల్లింగ్ పనులు ప్రారంభించారు. మరో బోరును కూరగాయల మార్కెట్‌లో పాత ట్యాంకు సమీపంలో వేయించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు మహ్మద్ బాబాఖాన్, కల్వ కిరణ్ కుమార్ చెప్పారు. నిధులు మంజూరు చేయించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అంజానాయక్, నాయకులు బుజ్జయ్యగౌడ్, అంజయ్య పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణాలు

గ్రామీణ యువతలోని క్రీడానైపుణ్యాన్ని వెలికి తీసి వారిని ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం గ్రామాలు, పట్టణాల్లో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేసింది. అన్ని క్రీడాస్థలాలు గ్రామానికి దూరంగా ఉండటంతో వినియోగానికి నోచుకోవడం లేదు.. దీంతో వీటి నిర్వహణ లేక చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి.

- గ్రామాలకు దూరంగా నిర్మించిన వైనం
- ప్రజాధనం వృథా



నీటూరు గ్రామానికి దూరంగా ఉన్న క్రీడాస్థలం

దౌల్తాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు అలంకారప్రాయంగా మారాయి. లక్షల రూపాయల నిధులు వెచ్చించి నిర్మించిన క్రీడా మైదానాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. గ్రామీణ యువత క్రీడల్లో రాణించేందుకు గత ప్రభుత్వం ఒక్కో గ్రామ పంచాయతీకి ఒక క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసింది. అందుకు అవసరమైన నిధులను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సమకూర్చింది. కానీ, ఈ మైదానాల వల్ల ఎవరికి లబ్ధి చేకూరని పరిస్థితి నెలకొంది. కొన్ని గ్రామాల్లో కేవలం బోర్డులు ఏర్పాటు చేసి మమ అనిపించారు. మరి కొన్ని గ్రామాల్లోని క్రీడామైదానాల్లో ఒక్కరోజు కూడా ఆటలు ఆడిన దాఖలాలు లేవు. ఒక్కొక్క క్రీడా ప్రాంగణానికి రూ.50000లతో మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో 20 గుంటల స్థలంలో క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. కొన్ని గ్రామాల్లో స్థలంలేని కారణంగా 10గుంటల స్థలంలో ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో గత సర్పంచ్‌లు స్థలాన్ని చదును చేసే క్రమంలో గ్రామపంచాయతీ నిధులతో క్రీడా ప్రాంగణానికి అధిక మొత్తంలో ఖర్చు చేశారు. వీటితో వ్యాయామానికి రెండు పోల్స్, రెండు వాలీబాల్ పోల్స్ వేయాల్సి ఉండగా వ్యాయామానికి సంబంధించిన పోల్స్ తప్ప వాలీబాల్‌కు చిన్న పోల్స్ ఎక్కడా కనిపించడం లేదు.

దూరభారం..

మండలంలోని గ్రామ పంచాయతీల్లో నిర్మించిన క్రీడా ప్రాంగణాలు చాలా వరకు గ్రామాలకు దూరంగా నిర్మించారు. దీంతో అనేక గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఎక్కడున్నాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. మండలంలో 10 గ్రామ పంచాయతీల్లో గ్రామానికి ఒకటి, రెండు కిలోమీటర్ల దూరంలో క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. దేవర్‌ఫసల్‌వాద్, నీటూరు, గోకఫసల్‌వాద్ గ్రామాల్లో దూరంగా ఏర్పాటు చేయడంతో నిరుపయోగంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గ్రామాలకు దగ్గరగా ఉండాలి



క్రీడా ప్రాంగణాలు కొన్ని గ్రామాల్లో దూరంగా ఉండటం వల్ల ప్రయోజనం లేకుండా పోయింది. దగ్గరగా ఉంటే ఉదయం, సాయంత్రం వ్యాయామాలు చేసుకునేందుకు, క్రీడలు ఆడేందుకు ఉపయోగంగా ఉంటుంది. తక్కువ స్థలంలోనైనా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలి.

–పులేందర్, దౌల్తాబాద్

వినియోగంలోకి తీసుకువస్తాం



గ్రామాలలో అప్పట్లో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు సూచించిన స్థలంలో ఏర్పాటు చేశారు.. కొన్ని గ్రామాల్లో వినియోగంలో లేవని తెలిసింది. వాటిని వినియోగంలోకి తీసుకువస్తాం. పిల్లలు ఆడుకునేలా చర్యలు తీసుకుంటాము.

–విజయలక్ష్మి, ఎంపీడీఓ

ఘనంగా ఆంజనేయస్వామి జాతర


జాతరలో పాల్గొన్న భక్తులు

దుద్యాల్: మండలంలోని చిలుముల మైల్వార్ గ్రామం అడవిలో వెలసిన మామిడికుంట ఆంజనేయ స్వామి జాతర ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం మూడవ శనివారం వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి వారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి పూజలు, అభిషేకాలు చేశారు. జాతరకు చుట్టూ పక్కల ఉన్న 20 గ్రామాల భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకుంటారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన


పూజలు చేస్తున్న పండితులు

మోమిన్‌పేట్: మండలంలోని ఎన్కెపల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి, విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

ధారూరు: మండల కేంద్రంలో ఆదివారం 4 గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో మండల ఏఈ వేణుగోపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతులు చేస్తున్నామని, ఉ.10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పాడనుందని వివరించారు.

పెద్దేముల్‌లో..

పెద్దేముల్: నేడు (ఆదివారం) పెద్దేముల్ మండల కేంద్రంలో ఉ.10గంటల నుంచి మధ్యాహ్న 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. 33కేవి తాండూరు ట్రాన్స్ కో ఉప కేంద్రంలో మరమ్మతులు న్నందున పెద్దేముల్ మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో కరెంటు అంతరాయం ఉంటుందని మండల ఏఈ రఘువీర్ శనివారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజ లు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

పరిగి పట్టణంలో..

పరిగి: నేడు (ఆదివారం) పట్టణ కేంద్రంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని విద్యుత్ ఏఈ ఖజా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని బహార్‌పేట్, హనుమాన్ టెంపుల్‌రోడ్, వాగ్దేవి ఆస్పత్రి, వల్లభనగర్, మార్కెట్ యార్డు, గంజ్‌రోడ్డ్, శాంతినగర్, సయ్యాద్‌వాడ, నాయకోట్‌వాడలకు ఉ.11గంటల నుంచి మ. 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

బడిలో గోపాలుడి సంబురాలు

శ్రీకృష్ణజన్మాష్టమిని పురస్కరించుకొని జిల్లాలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో శనివారం ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషాధారణ అందరిని ఆకట్టుకుంది. అనంతరం వారితో ఉట్టికొట్టించి సందడి చేశారు.


పరిగి: ప్రాథమిక పాఠశాలలో..


దుద్యాల్: గాంధీచౌక్‌లో..


పూడూరు: ఉట్టి కొడుతున్న చిన్నారి


పరిగి: ఉట్టికొడుతున్న విద్యార్థులు


కుల్కచర్ల: ప్రభుత్వ పాఠశాలలో..


తాండూరు రూరల్ : ఉట్టి కొడుతున్న శ్రీకృష్ణ, గోపికలు


దోమ : బొంపల్లి పాఠశాలలో..


తాండూరు రూరల్ : శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారులు, ఉపాధ్యాయులు


పెద్దేముల్: నాగులపల్లి పాఠశాలలో..